# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

### కాంగ్రెస్ గెలిస్తే చీకటి రోజులే..



కాంగ్రెస్ పార్టీ గెలిస్తే మళ్లీ చీకటి రోజులే. 3 గంటల కరెంటు ఇస్తే ఒక్క మడి కూడా తడవదు. ఎప్పుడొస్తదో తెల్వని కరెంట్‌తో మళ్లీ పడిగాపులు కాయాల్సి వస్తది. కరెంట్ షాక్‌లు, పాములు, తేళ్ల బారినపడి మళ్లీ ప్రమాదాలకు గురికావాల్సి వస్తది. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి రానివ్వం. సీఎం కేసీఆర్ వెంటే ఉంటం. రాక్షసుల దోపిడీ రాజ్యం మాకొద్దు. ఎవ్వరూ కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దు. సంక్షేమం, అభివృద్ధి కోసం మళ్లీ బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకుంటం. రైతులకు భరోసా కల్పించే కారుగుర్తుకే ఓటు వేస్తం.

– సత్యనారాయణ,శేరిగూడ గ్రామం (శంకర్‌పల్లి)

### మూడు గంటల కరెంట్‌తో మడి కూడా పారదు..

మూడుగంటల కరెంట్‌తో ఒక మడి కూడా పారదు. కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోతలతో అనేక ఇబ్బందులు పడ్డం. ఇచ్చే ఆరు గంటల కరెంట్ రాత్రి, పగలు సరఫరా చేసేటోళ్లు. పంటలకు నీళ్లు పెట్టేందుకు రాత్రిపూట పొలాలకు వెళ్లి నానా అవస్థలు పడాల్సి వచ్చేది. రైతుబిడ్డగా సీఎం కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తున్నడు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మరు. అది అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు.. రైతులతో పెట్టుకున్న వాళ్లు ఎవరూ ముందుకు సాగలేదు. రైతుల సంక్షేమం కోరుకునే బీఆర్ఎస్ పార్టీకే మా మద్దతు. సీఎం కేసీఆర్ వెంటే ఉంటం. మాతోపాటు మరికొందరితో కారు గుర్తుకు ఓటు వేయిస్తం.

– కొత్తపల్లి వెంకటరెడ్డి, రైతు కుమ్మరిగూడ(షాబాద్)




# కాంగ్రెస్ అంటేనే..
# కటిక చీకట్లు

**3 గంటల కరెంటుతో రైతుల బతుకులు ఆగమాగం**

**10 హెచ్‌పీ మోటర్లతో ఆర్థిక భారం**

**శనిలా దాపురించిన కాంగ్రెస్ మా కొద్దంటున్న రైతాంగం**

**కేసీఆర్ ప్రభుత్వానికి అండగా ఉంటామంటున్న జిల్లా రైతాంగం**



రంగారెడ్డి, నవంబరు 25(నమస్తే తెలంగాణ): పదేండ్ల కిందటి కరెంటు కష్టాలు, సాగు బాధల నుంచి గట్టెక్కిన తెలంగాణ రైతాంగం..సొంత రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల పూర్తి ఉచిత విద్యుత్తుతో రెండేసి పంటలను పండిస్తూ సంతోషంగా ఉన్నది. కాంగ్రెస్ హయాంలో పడ్డ కరెంటు కష్టాలను మెల్లమెల్లగా మర్చిపోతున్నారు. రాత్రిళ్లు కరెంటు కోసం బాయికాడికి వెళ్లి పాములు కరిచి చనిపోయిన ఘటనలు..రాత్రిపూట చేలల్లోనే గడిపిన ఆ కాళరాత్రులు కష్టాలను తలుచుకుంటేనే ఒళ్లు జలదరిస్తున్నదని రైతన్నలు వాపోతున్నారు. నాడు పంటలు చేతికిరాక..చేసిన అప్పులు తీరక అన్నదాతలు పడ్డ అగచాట్లను తమ జ్ఞాపకాల్లోంచి తుడిచేసుకున్నారు. మళ్లీ కాంగ్రెస్ వస్తే ఉరికొయ్యల పాలు కావడం తప్ప మరో మార్గం ఉండదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు మరోసారి మూడు గంటల కరెంటు అంటుంటే అల్లాడిపోతున్నారు. కరెంటు లేక కండ్ల ముందే పంటలు ఎండిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు కాలిపోయి పడిన యాతనలను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. మరోపక్క కాంగ్రెస్ నేతలు చెప్తున్నట్లుగా రైతులు వ్యవసాయానికి ఉపయోగిస్తున్న 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్ల స్థాయిలో 10 హెచ్‌పీ మోటర్లను బిగించుకోవడం ఆషామాషీ వ్యవహారం కాదని రైతులు పేర్కొంటున్నారు. రైతులపై అదనపు భారాన్ని మోపి రుణగ్రస్తులుగా మార్చే కుట్రలపై రంగారెడ్డి జిల్లా రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ఇది రైతుల కొంప ముంచే యవ్వారం అని హెచ్చరిస్తున్నారు. శనిలా దాపురించిన కాంగ్రెస్‌ను వదిలించుకుని రైతుల కోసం అహర్నిశలు పాటుపడుతున్న కేసీఆర్ ప్రభుత్వానికి అండగా ఉంటామని రైతాంగం పేర్కొంటున్నది.

### కాంగ్రెస్ పార్టీకి రైతుల బాగు పట్టదు..

రైతులు బాగుపడడం కాంగ్రెస్ పార్టీకి ఇష్టం లేనట్టుంది. అబద్ధపు హామీలను ఇచ్చి అధికారంలోకి రావాలని చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీని రైతులు నమ్మే పరిస్థితి లేదు. వ్యవసాయానికి 3 గంటల కరెంట్ సరిపోతుందని చెబుతున్న రేవంత్‌రెడ్డికి అసలు వ్యవసాయం అంటే తెలుసా. వ్యవసాయం చేస్తే ఆ బాధలేందో తెలుస్తయి. 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్న బీఆర్ఎస్ పార్టీకే మా మద్దతు. రైతులకు అన్నివిధాల సాయమందిస్తున్న సీఎం కేసీఆర్ వెంటే ఉంటాం.

– మర్రి శేఖర్‌రెడ్డి, రాగన్నగూడ (తుర్కయంజాల్)



### ఎవుసం చేసినోడికే తెలుస్తది..

ఎవుసం చేసినోడికే ఆ కష్టం తెలుస్తది. మూడు గంటల కరెంట్‌తో మూడు గుంటలు కూడా పారదు. 10హెచ్‌పీ మోటరు పెడితే బోర్లల్లో నీళ్లు ఉంటాయా.. అంత తొందరగా ఊట రావద్దా.. కాంగ్రెసోళ్లు తెలిసి మాట్లాడుతుండ్రా.. తెల్వక మాట్లాడుతుండ్రా.. పైగా 10హెచ్‌పీ మోటరు పెడితే లక్ష దాకా ఖర్చవుతది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులు అరిగోస పడుతరు. 24 గంటల కరెంట్ ఇచ్చే బీఆర్ఎస్‌నే గెలిపిస్తాం. మళ్లీ ముఖ్యమంత్రి కేసీఆర్ కావడం ఖాయం.

– గూడూరు సురేందర్‌రెడ్డి, (కడ్తాల్)



### 10 హెచ్‌పీ మోటర్లు ఎవరూ వాడరు..

వ్యవసాయానికి 3హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లనే ఎక్కువగా వాడుతుర్రు. 10హెచ్‌పీ మోటర్లను ఎవరూ వాడరు. 24గంటల కరెంట్‌తో రైతులు మంచిగా పంటలు పండించుకుంటున్నారు. గతంలో రాత్రిళ్లు కరెంట్ ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో తెల్వకుండే. ఇప్పుడైతే నీళ్లు పుష్కలమే.. కరెంట్ పుష్కలమే. రైతుల బాధలు పోయినయ్. కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంటే ఇస్తే పంటలు ఎలా పండించుకుంటరు. రైతులకు పాత రోజులొస్తాయి. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఎప్పటికీ అధికారంలోకి రాదు. సీఎం కేసీఆర్ వెంటే ఉంటాం. కారుగుర్తుకే ఓటు వేస్తం.

– సునీల్‌రెడ్డి, వెల్జర్ల గ్రామం (షాద్‌నగర్‌టౌన్)



### కాంగ్రెస్‌ను నమ్ముకుంటే చీకట్లే..

కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ఓటేస్తే రైతులు చీకటిలో గడపాలి. ఆ పార్టీ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. 10 హెచ్‌పీ మోటరు అంటే అవస్థలే. 3 గంటల కరెంటుతో ఎంత పొలం పారుతది. 24 గంటల కరెంటు ఇస్తున్న సీఎం కేసీఆర్ వెంటే ఉంటాం. మళ్లీ చీకటి రోజులు చూపించాలనుకుంటున్న కాంగ్రెస్ పార్టీని నమ్మబోము. సీఎం కేసీఆర్‌కు రైతుల మద్దతు ఉన్నది. మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. కారు గుర్తుకు ఓటు వేసి మూడోసారి ముఖ్యమంత్రిని చేస్తాం.

–వన్నం మహేశ్, పెంజర్ల, (కొత్తూరు)



### రైతుల అవసరాలు వాళ్లకేం తెలుసు..



24 గంటల ఉచిత కరెంట్‌తో హాయిగా వ్యవసాయం చేసుకొని మంచి పంటలు పండిస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ నాయకులు రేవంత్‌రెడ్డికి వ్యవసాయం మీద కనీస అవగాహన లేదు. చిన్న, సన్నకారు రైతులు 10 హెచ్‌పీ మోటర్లు వాడరు అనే విషయాన్ని గుర్తించాలి. ఒక సాధారణ రైతు 10 హెచ్‌పీ మోటరు వాడాలంటే దాదాపు రూ.లక్ష వరకు ఖర్చు వస్తుంది. ఎన్నికల్లో లబ్ధి కోసమే కాంగ్రెస్ నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతుండ్రు. 24 గంటల కరెంట్ ఇస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి రైతుల మద్దతు ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ ఎంత ఎత్తుగడలు వేసినా అధికారంలోకి రాదు. సచ్చిన పార్టీ మాటలు మేము నమ్మము. రైతుల సంక్షేమం కోసం కృషి చేసే సీఎం కేసీఆర్‌కే మా మద్దతు. కారుగుర్తుకే ఓటు వేస్తాం.

– కంబాలపల్లి లక్ష్మయ్య, విఠాయిపల్లి, ఆమనగల్లు మున్సిపాలిటీ

### కాంగ్రెసోళ్లకు ఓటేస్తే ఎవుసం ఎండినట్లే..

మూడు గంటల కరెంటు అంటున్న కాంగ్రెసోళ్లకు ఓటు వేస్తే ఎవుసం ఎండినట్లే. పైగా 10హెచ్‌పీ మోటర్లు పెట్టి ఇక వ్యవసాయం చేసినట్లే.. లక్షల ఖర్చు ఎక్కడి నుంచి తేవాలె. చిన్న, సన్నకారు రైతులు ఎట్లా భరించాలె. ప్రస్తుతం 3, 5హెచ్‌పీ మోటర్లనే వాడుతున్నరు. తెలిసి.. తెలిసి కాంగ్రెస్‌కు ఓటు వెయ్యం. అది అధికారంలోకి రాదు. మళ్లీ బీఆర్ఎస్ పార్టీనే అధికారంలోకి వస్తుంది. సీఎం కేసీఆర్ వెంటే రైతులమంతా నడుస్తం. వ్యవసాయం పండుగలా సాగుతున్నది. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రైతులు రాజులవుతారు. ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న రైతులను కాంగ్రెస్ పార్టీ మోసం చేయాలని చూసినా నమ్మేవారు లేరు. కారుగుర్తుకే మా ఓటు.

– కదారి నిరంజన్ , జంగారెడ్డిపల్లి (ఆమనగల్లు)

